క్లుప్తంగా

ప్రియాంతి కుటుంబానికి ఆనంద్‌కుమార్ పరామర్శ

అండగా ఉంటామని భరోసా



ప్రియాంతి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఆదారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు వినోద్ నగర్‌లో నివాసముంటున్న ప్రియాంతి బిశ్వాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలిసిన వైఎస్సార్‌సీపీ పశ్చిమ అభ్యర్థి ఆదారి ఆనంద్ కుమార్ ఆమె కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. ప్రియాంతి బిశ్వాస్ మంచి వ్యక్తిగా ఈ ప్రాంతంలో పేరు గాంచిందన్నారు. వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో చుక్క ప్రసాదరెడ్డి, వార్డు క్లస్టర్ అధ్యక్షుడు నమ్మి వెంకటకృష్ణ మూర్తి యాదవ్, ఎల్లపు వెంకటేశ్వరరావు, రామకృష్ణ, ఆళ్ల పైడిరాజు, అప్పలస్వామి నాయుడు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన



సుభాష్‌నగర్‌లో ఓటర్ జాబితాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముర్రు వాణి

కంచరపాలెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జీవీఎంసీ 57వ వార్డు కార్పొరేటర్ ముర్రు వాణి ఆధ్వర్యంలో బుధవారం ఓటరు జాబితా పరిశీలన చేశారు. ఓటరు జాబితా ప్రకారం ఆయా చిరునామాలో ఓటర్లు ఉన్నారా.. డూప్లికేట్ ఓట్లు.. మరణించిన వారి పేర్లు ఉన్నాయా అని తెలుసుకున్నారు. ఊర్వశికూడలి సుభాష్‌నగర్, ఐటీఐ జంక్షన్ తుమ్మడపాలెం, మర్రిపాలెం శ్యామ్‌నగర్, ఆశవానిపాలెం, దుర్గాపురం, సాకేతిపురం ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ పార్టీ కన్వీనర్లు, జేసీఎస్ సభ్యులు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి జాబితాను పరిశీలించారు.

ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే చర్యలు

ఆర్వో హుస్సేన్ సాహెబ్



మాట్లాడుతున్న ఆర్వో హుస్సేన్ సాహెబ్

కంచరపాలెం: ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే చర్యలు తప్పవని పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో) హుస్సేన్ సాహెబ్ పేర్కొన్నారు. జ్ఞానాపురం జోన్-5 జోనల్ కార్యాలయంలో సమావేశం మందిరంలో బుధవారం సాయంత్రం రెవెన్యూ డివిజనల్ అధికారి నేతృత్వంలో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీసీ వీఎస్‌టీ టీమ్ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీమ్ సభ్యులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఎన్నికల కమిషన్ సూచనల మేరకు పని చేయాలని సూచించారు. ఎన్నికల నియమావళిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఎస్‌వీటీ, ఎఫ్ఎస్‌టీ బృందాలు నియోజకవర్గంలో పర్యటిస్తూ నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డీటీ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకుంటాం

గోపాలపట్నం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మొల్లేటి ఉట్టిబాబు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని టీఎంటీ సంస్థ చైర్మన్ సురేష్ కుమార్ తెలిపారు. సోమవారం ఎయిర్‌పోర్టు జంక్షన్ వద్ద టిప్పర్ ఢీకొట్టిన ప్రమాదంలో ఉట్టి బాబు మృతి చెందిన విషయం విదితమే. ఉట్టిబాబు మృతితో కుటుంబ సభ్యులు ఉపాధిలేక వీధిన పడ్డారు. వీరి స్థితిని ఆయన దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించి సాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. కంపెనీ ప్రతినిధులు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఆరోగ్య భరోసా



దంతాలను పరీక్షిస్తున్న వైద్యురాలు

నాడు: సాధారణ, మధ్య తరగతి కుటుంబాల్లో వ్యక్తులు జబ్బు బారిన పడితే అంతే సంగతులు.. బతుకు మీద ఆశలు వదులుకుని కనీస సౌకర్యాలు లేని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవడం.. లేదా జీవితాలు తాకట్టుపెట్టి అప్పులు చేసి ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరడాన్ని మించిన గత్యంతరం లేదు.

నేడు: ఆ పరిస్థితి మారింది. ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసింది. ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మార్చింది. సకల వసతులు కల్పించింది. ఫలితంగా పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వాస్పత్రిలో పేదోడికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతోంది. దీంతో తమకు వైద్య భరోసా లభించిందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గైనిక్ విభాగం ఓపీ వద్ద వేచి ఉన్న మహిళలు (ఇన్‌సెట్) గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన టీవీలు

- సర్కారు ఆస్పత్రిలో ఉచితంగా ఖరీదైన వైద్యం
- గోపాలపట్నం ఆస్పత్రిలో దంత వైద్యం కూడా..
- అందుబాటులోకి అత్యాధునిక వైద్య పరికరాలు

గోపాలపట్నం: దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో ఆస్పత్రులను అభివృద్ధి చేసింది. రక్త పరీక్షల నుంచి మందుల వరకూ అన్నీ ఉచితంగా అందిస్తోంది.

కార్పొరేట్ ఆస్పత్రిని తలపించేలా..

గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ప్రభుత్వం సుందరంగా తీర్చిదిద్దింది, విశాలమైన ఓపీ హాల్, ఆధునిక బెడ్లు సమకూర్చింది. నిరంతర పర్యవేక్షణ చేసేలా వైద్యులతో పాటు సిబ్బందిని అందుబాటులోకి తెచ్చింది. గతంలో ఈ ఆస్పత్రి ఎందుకూ పనికిరానిదిగా ఉండి పోతుందనుకున్నారు. ఈ ఐదేళ్లలో ఎవరూ ఊహించని విధంగా దశ మార్చుకుంది. గతంలో డెప్యుటేషన్ లోనే వైద్యులు పని చేసేవారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెగ్యులర్ వైద్యులను నియమించారు. మరో వైపు దంత వైద్య సేవలు కూడా అందుబాటులోకి తెచ్చారు. రోజుకు కనీసం 35 మంది వైద్య పరీక్షలు చేసుకుంటున్నారు. ఇక్కడ ఎక్స్‌రే సౌకర్యం కూడా ఉంది. పిప్పిపళ్లు, చిగుళ్ల వ్యాధి, రైట్ రెనాల్, ఫొటో సర్జరీ, సీవింగ్ వంటి వైద్య సేవలు అందిస్తున్నామని దంత వైద్యురాలు వనితా పావని చెబుతున్నారు.

వారంలో మూడు రోజులు సేవలు

గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో సోమవారం, బుధవారం, శుక్రవారాల్లో దంత వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. మిగిలిన రోజుల్లో ఈ ప్రాంతాల్లో ఉన్న పట్టణ హెల్త్ సెంటర్లలో సేవలందిస్తారు.

ఆహ్లాదకరమైన వాతావరణం

గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆహ్లాదరకమైన వాతావరణం కనిపిస్తోంది. పిల్లలను ఆకట్టుకునే విధంగా అందమైన చిత్రాలతో పాటు ఇటీవల ప్రత్యేకంగా టీవీలను ఏర్పాటు చేశారు. ఇక్కడి పిల్లల వార్డు, గర్భిణుల ఓపీ వద్ద 55 ఇంచీల టీవీలు అమర్చారు. ఇందులో పిల్లలను ఆకట్టుకునేలా కార్టూన్ నెట్ వర్కు, తల్లి దండ్రులను ఆకట్టుకునే విధంగా సినిమాలు ప్రదర్శిస్తున్నారు. ఈ విధమైన ఏర్పాట్లు బాగున్నాయని మానసికంగా ఉత్తేజ పరుస్తున్నాయని రోగులు చెబుతున్నారు.

దంత సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



దంత సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి. ఇవి మన ఆరోగ్యానికి ప్రదానమైనవి. ఆహారాన్ని తీసుకోవడంలో కీలకం. అందుకే దంతాలపై అశ్రద్ధ వహించకూడదు. ఏ చిన్న సమస్య వచ్చినా వైద్యులను సంప్రదించాలి. ప్రతీ ఆర్నెల్లకు ఒక సారి దంత పరీక్షలు చేసుకోవాలి. రోజుకు రెండు సార్లు దంతాలు శుభ్రం చేసుకోవాలి. ఆస్పత్రిలో వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు, ఎక్స్‌రే సేవలు ఉచితంగా పొందవచ్చు. కార్పొరేట్ ఆస్పత్రుల కంటే మెరుగైన వైద్యం అందుతోంది.

– డాక్టర్ వనితా పావని, దంత వైద్యురాలు, గోపాలపట్నం సీహెచ్‌సీ

అభివృద్ధికి పట్టం కట్టండి



అశేష అభిమానుల మధ్య ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనంద్‌కుమార్

- ధైర్యంగా ప్రజల ముందుకొచ్చి ఓటడుగుతున్నాం
- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనంద్‌కుమార్
- 60వ వార్డులో ఎన్నికల ప్రచారానికి జన నీరాజనం

మల్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనంద్‌కుమార్ అన్నారు. రానున్న ఎన్నికల్లో అభివృద్ధికి పట్టం కట్టి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజల ముందుకు ధైర్యంగా వచ్చి ఓటడుగుతున్నానన్నారు. 60వ వార్డు జవహర్‌నగర్ రెండు గుడుల సెంటర్ నుంచి బుధవారం సాయంత్రం ఆయన తన ఎన్నికల ప్రచారం చేపట్టారు. కార్పొరేటర్ పి.వి.సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ఇక్కడ కొలువైన పెంటమాంబ, ముత్యాలమ్మ ఆలయాల్లో ఆదారి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈ ప్రాంతంలోని ఇంటింటికీ వెళ్లి సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు.

మరింత అభివృద్ధి చేస్తా..

ఈ సందర్భంగా ఆదారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారుల సంతోషం చూసి ఓటు అడగ్గలుగుతున్నామని, ఆ ధైర్యం ఇక్కడ పోటీ చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి ఉందా.. అని స్థానికులను అడిగారు. ఎప్పుడో ఎన్నికల సమయంలో, మళ్లీ ఇప్పుడు ఓట్ల కోసం తమ ప్రాంతానికి ఎమ్మెల్యే గణబాబు వచ్చాడని, మధ్యలో తాము ఏమయ్యామో కనీసం కన్నెత్తి చూడలేదని అక్కడి ఓటర్లు బదులిచ్చారు. ఈ ప్రాంత ప్రజలు తనపై చూపుతున్న ప్రేమాభిమానాలను ఎన్నడూ మరువనని, తమ అభిమానాన్ని ఓటు రూపంలో చూపిస్తే ఎప్పటికీ కృతజ్ఞుడనై ఉంటానని ఆదారి అన్నారు. ఈ ప్రాంతంలో సుమారు రూ.10 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టామని, ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న ఆదారి

యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, పశ్చిమ ఎన్నికల పరిశీలకుడు పీలా ఉమారాణి, కార్పొరేటర్ పి.వి.సురేష్‌లు మాట్లాడుతూ నమ్మిన వారిని గుండెల్లో పెట్టుకుని చూసుకునే వ్యక్తి ఆదారి ఆనంద్‌కుమార్ అని, అటువంటి వ్యక్తిని ప్రజలంతా తప్పక ఆశీర్వదించాలని కోరారు. ఏ కష్టం వచ్చినా ఆయన తరఫున తామంతా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. టీడీపీ-జనసేన-బీజేపీల మోసపూరిత మాటలను నమ్మి మోసపోవదన్నారు. ఈ ప్రాంతంలో ఆదారి నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి జనం నీరాజనాలు పలికారు. కార్యక్రమంలో క్లస్టర్ అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు ఆదారి హరీష్, ధనలత, పత్నిరావు, సుందర్‌రావు, ఉద్దా భాస్కర్‌రావు, హనుమంతురావు, బిల్డర్ సంతోష్, పత్నీరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఆదారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు ఎం.అప్పారావు దంపతుల ఆధ్వర్యంలో బుధవారం పారిశ్రామిక ప్రాంత ముఖ్య నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అతిథిగా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పార్టీని నమ్ముకుని పనిచేసే ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉన్నానన్నారు. మన విజయాన్ని ముందుగానే ప్రత్యర్థులు గ్రహించారని, అందుకే వారి మొహాల్లో చిరునవ్వులు కనిపించడం లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన సాగిస్తున్నారని.. తద్వారా ప్రజల ముందుకు ధైర్యంగా, నిజాయితీగా వచ్చి ఓటు అడిగే స్థితిలో ఉన్నామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి అంతా సమష్టిగా కృషి చేయాలని ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ పశ్చిమ ఎన్నికల పరిశీలకులు పీలా ఉమారాణి, ట్రేడ్ యూనియన్ రీజినల్ కో-ఆర్డినేటర్ బద్రీనాథ్, 60వ వార్డు కార్పొరేటర్ పి.వి. సురేష్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం, మాజీ కార్పొరేటర్ గల్లా శ్రీను, కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ మళ్ల ధనలత, నూకరెడ్డి, మూగి సూర్యనారాయణ, పార్టీ వార్డు అధ్యక్షుడు జి.వి.ఎస్.ఎన్.రాజు(కేబుల్ వాసు) తదితరులు పాల్గొన్నారు.

45 రోజులు కష్టపడదాం

- ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనంద్‌కుమార్
- 61వ వార్డులో పార్టీ కార్యాలయం ప్రారంభం



పార్టీ కార్యలయాన్ని ప్రారంభిస్తున్న ఆదారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: మరో 45 రోజులు కష్టపడితే రాష్ట్ర ప్రజానీకంతో పాటు నాయకుల భవిష్యత్తు బాగుంటుందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనంద్‌కుమార్ అన్నారు. 61వ వార్డు మల్కాపురం నగరాలవీధి వద్ద వైఎస్సార్‌సీపీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ కష్టం వచ్చినా తాను అందుబాటులో ఉంటానని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలను వివరించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను ఎంపీ బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ ఎం.అప్పారావు, పార్టీ ఎన్నికల పరిశీలకురాలు పీలా ఉమారాణి, ట్రేడ్ యూనియన్ రీజినల్ కో-ఆర్డినేటర్ బద్రీనాథ్,60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ,మాజీ కార్పొరేటర్ గల్లా శ్రీను,జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం,మళ్ల ధనలత,61వ వార్డు పార్టీ అధ్యక్షుడు కేబుల్ వాసు తదితరులు పాల్గొన్నారు

జనం మెచ్చిన నాయకుడు సీఎం జగన్



ఇందిరానగర్‌లో ప్రచారం చేస్తున్న బెహరా భాస్కరరావు తదితరులు

గోపాలపట్నం: జనం మెచ్చిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని వైఎస్సార్‌సీపీ మండల అధక్షుడు, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. జీవీఎంసీ 92వార్డు ఇందిరానగర్, నరసింహనగర్ ప్రాంతాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి వెళ్లి పశ్చిమంలో ప్రజలకు దూరమైన నాయకత్వాన్ని మార్చాలని, మంచి వ్యక్తి అయిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆదారి ఆనంద్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. గత ప్రభుత్వానికి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి గల వ్యత్యాసాన్ని వివరించారు. 99 శాతం హామీలు నెరవేర్చి పేదల పక్షపాతి అయిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గుణిశెట్టి శ్రీనివాసరావు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీ కృష్ణ, కడిమి రామకృష్ణ, మార్కొండేయ రాజశేఖర్, కంపర సత్తిబాబు, ఊటపల్లి గోవిందు, కంపర కోటేశ్వరరావు, నీలాపు శ్రీనివాస రెడ్డి, యు. ప్రకాష్, బి. శ్రీనివాసరావు, జి నాగరాజు, రమాదేవి, విజయ, వెంకటలక్ష్మి, లలిత పాల్గొన్నారు.


అపార్ట్‌మెంట్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి



గ్రూప్ హౌస్ వాసికి నోటీసులు అందిస్తున్న ఏఎస్ఐ గోవిందమ్మ

గోపాలపట్నం: గోపాలపట్నం క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలోని అపార్ట్‌మెంట్లు, గ్రూప్ హౌసుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఏఎస్ గోవిందమ్మ సూచించారు. వెస్ట్ జోన్ క్రైం సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నేరాల కట్టడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఆమె చెప్పారు. ఒంటరిగా వెళ్లేటప్పుడు మహిళలె అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మారు మూల ప్రాంతాలకు ఒంటరిగా వెళ్ల వద్దని సూచించారు. అపార్ట్‌మెంట్లు, గ్రూప్ హౌసుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నోటీలు అందించారు. సీసీ కెమేరాల వల్ల నేరస్తుల్ని సులువుగా గుర్తించి పట్టుకునేందుకు దోహదపడతాయని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది మోహన్ రావు, ఎస్. అర్జున్, శివరామకృష్ణ, సుధాకర్, శివకృష్ణ పాల్గొన్నారు.

శేషతల్పంపై అప్పన్న



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: సింహగిరిపై నిర్వహించిన సుదర్శన నారసింహ మహా యజ్ఞంలో భాగంగా బుధవారం సాయంత్రం స్వామికి శేషతల్పంపై తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవిలను ముస్తాబు చేసి శేషతల్పంపై అధిష్టం పజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధిని ఘనంగా నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన పురోహిత్డు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, రుత్వికులు, పారాయణదారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో జనసేన కార్యకర్తల చేరిక



పార్టీలో చేరిన వారితో ఆదారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రాంతానికి చెందిన జనసేన కార్యకర్తలు ప్రముఖ కాంట్రాక్టర్ ఎం.అప్పారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనంద్‌కుమార్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమంతో జగన్ మోహన్‌రెడ్డి ప్రజలను ఆదుకుంటుంటే.. నియోజకవర్గంలో ఆనంద్‌కుమార్ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం గొప్ప విషయం అన్నారు. అందుకే వైఎస్సార్‌సీపీలో చేరినట్టు యువకులు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ ఎన్నికల పరిశీలకురాలు పీలా ఉమారాణి,ట్రేడ్ యూనియన్ రీజనల్ కో-ఆర్డినేటర్ బద్రీనాథ్,60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్,ఎం.అప్పారావు,ఎం. నాగమణి,గల్లా శ్రీను,దాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మళ్లీ ఇది రాని రోజు

50 ఏళ్ల తర్వాత కలుసుకున్న గోపాలపట్నం హైస్కూల్ పూర్వ విద్యార్థులు



ఉపాధ్యాయులతో గోపాలపట్నం హైస్కూల్ 1973-74 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

గోపాలపట్నం: గోపాలపట్నం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1973–74 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు 50 ఏళ్ల తరువాత కలుసుకుని సందడి చేశారు. బుధవారం వీరి ఆత్మీయ కలయికకు గోపాలపట్నం పిన్నమనేని ఫంక్షన్ హాల్ వేదికగా నిలిచింది. మొత్తం నాలుగు సెక్షన్లలో 70 మంది కలుసుకుని తమ వృత్తి, కుటుంబ విషయాలు, అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సరదాగా గడిపారు. సహచర పూర్వ విద్యార్థి ఏపీ జెన్‌కో(హెచ్ఆర్, ఐఆర్) విభాగం డైరెక్టర్ సయ్యద్ రఫీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆనాటి స్నేహితులంతా ఒక చోట చేరడం చాలా సంతోషాన్ని కలిగించిందన్నారు. ఇది తమ జీవితాల్లో మరపురాని రోజుగా నిలుస్తుందని చెప్పారు. తోటి స్నేహితుల కుటుంబాలకు సాయపడటం మంచి ఆలోచనని, ఇందులో తాను భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు.

పూర్వ విద్యార్థుల్లో మృతిచెందిన స్నేహితుల కుటుంబాలకు అండగా నిలవాలని వీరు నిర్ణయించుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు బి.లక్ష్మీనారాయణ శాస్త్రి, దాసరి సన్యాసిరావు, కృష్ణమూర్తి, బ్రహ్మానందం, కామేశ్వరరావు, శాంతికుమారి, చిన్నంనాయుడు భవానీలను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు ఎ.ఎస్.మూర్తి, బి.సోమేశ్వరరావు, సాయ్యద్ వాసాయి, అచ్చం నాయుడు, పూరెడ్డి ఈశ్వరరావు, శంకర్‌రెడ్డి, కమల్, యూఎస్ నుంచి శ్రీనివాస్ వశిష్ఠ కార్యక్రమ ఏర్పాట్లను సమీక్షించారు.

అలరించిన కథా కచేరీ



కార్యక్రమంలో పాల్గొన్న ప్రభాకర్, విజయ్‌కుమార్

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కథా కచేరి కార్యక్రమం అలరించింది. పలువురు సాహితీ వేత్తలు తమ కథలను సభకు పరిచయం చేశారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కథల్లో జీవితం, వ్యక్తుల స్వభావం, ప్రాపంచిక సత్యాలు కనిపించాలన్నారు. కథ చదివిన పాఠకులకు తెలియని అనుభూతి కలగాలన్నారు. డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ రచయితలు సామాజిక స్పృహ ఉన్న రచనలు చేయాలని సూచించారు. అనంతరం జరిగిన కథా కచేరిలో రచయితలు ద్విభాష్యం రాజేశ్వరరావు, సాధనాల వెంకటస్వామి, బాఘవతుల సత్యనారాయణ మూర్తి, డాక్టర్ డి.వి.సూర్యారావు, కొత్తూరి రమణ, సిహెచ్. చినసూర్యనారాయణ, జె.పి.శర్మ, అయ్యల సోమయాజుల ప్రసాద్ తదితరులు స్ఫూర్తిదాయకమైన కథలు వినిపించారు.

3 నుంచి మహిళలకు వేసవి శిక్షణ తరగతులు

మురళీనగర్: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 3 నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్ పేస్ట్రీ షాపు సమీపంలోని భవనంలో కె.సుగుణ ఆధ్వర్యంలో మహిళలకు జ్యూట్ బ్యాగ్స్ స్టిచింగ్‌పై పది రోజుల పాటు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల వారు 90320 94771 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.